వామ్మో.. వానొస్తుందేమో..!

- తుపాను ఎఫెక్ట్ పడుతుందేమోనని రైతుల 'వర్రీ'
- మరో వారం రోజుల్లో కోతలు ప్రారంభం
- వర్షం కురిస్తే తడిసి నష్టపోతామనే భయాందోళన



సోమందేపల్లి వద్ద గంగాదేవి వంక రోడ్డులో తుపాను ప్రభావంతో నేలవాలిన వరి

పెనుకొండ: ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట మరో వారం, పదిరోజుల్లో కోత కోయాల్సి ఉంది.. రెండుమూడు రోజులుగా వర్ష (తుఫాను)ప్రభావం కనిపిస్తోంది. మేఘాలు కమ్ముకొస్తున్నాయి.. మబ్బులు భయపెడుతున్నాయి.. అక్కడక్కడ వర్షం కురుస్తోంది.. ఐదు నెలలుగా కంటికి రెప్పలా కాపాడుకున్న పంట..తీరా కోతపెట్టిన తర్వాత వర్షం వస్తే నిండా మునిగిపోతామని అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు. పంట తడిస్తే వరి ధాన్యం నల్లబడిపోతుందని, పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. పెనుకొండ వ్యవసాయశాఖ సబ్ డివిజన్‌లో పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లో 2,569 హెక్టార్లలో రైతులు ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసారు. పరిగి, గోరంట్ల మండలాల్లో తెలంగాణా సోనా, హైదరాబాద్ సోనా, సౌభాగ్య సోనా ఇతర సన్న,సోనా రకాలతో పాటు బీపీటీ రకాలను రైతులు సాగు చేశారు. ఎక్కువ భాగం బోరుబావుల కింద వరి సాగు చేశారు. ఎకరాకు రూ.35 వేల మేర ఖర్చు చేసిన రైతులు.. మరో వారం రోజుల్లో పంట కోయడానికి సిద్ధం చేశారు. తుఫాన్ ప్రభావంతో గింజలతో నిండిఉన్న వరి కర్రలు నేలవాలుతున్నాయి. దీంతో వరి గింజలు ఎక్కడ మొలకెత్తుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడి ఆశాజనకం..

అన్నదాతలు నూతన వరి వంగడాలు సాగు చేశారు. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంది. అయితే ఇటీవల తుఫాన్ విపత్కర పరిస్థితులు భయాందోళన కలిగిస్తున్నాయి. పంట సాగుకు చంద్రబాబు ప్రభుత్వం ఏ మాత్రమూ సాయం చేయకున్నా సొంత డబ్బుతో అప్పు చేసి, బ్యాంకుల్లో నగలు తాకట్టు పెట్టి వరి పంట సాగు చేసిన రైతులు తుఫాన్ ఎఫెక్ట్‌తో వేలకు వేలు నష్టపోయి పరిస్థితి దాపురించింది. తుఫాన్‌తో ఆకాశం మేఘావృతమవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెనుకొండ సబ్ డివిజన్‌లో వరి సాగు ఇలా..

మండలం పేరు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
పెనుకొండ	350
సోమందేపల్లి	179
రొద్దం	460
పుట్టపర్తి	490
బుక్కపట్నం	480
కొత్తచెరువు	610

కోత దశలో దెబ్బతీస్తుందేమోనని..



కోత దశలో తుఫాన్ రావడంతో వరి మడి మొత్తం నేలవాలింది. ఏ మాత్రం ఆలస్యం చేసినా గింజలు మొలకెత్తి రైతులకు తీరని నష్టం జరుగుతుంది. చాలా మంది రైతులు వాలిపోయిన వరి పంటను చూసి ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే వరి పంటలను పరిశీలించి, రైతులకు అండగా నిలవాలి.

– నీరగంటి కిష్టప్ప, రైతు, సోమందేపల్లి

క్లుప్తంగా

గ్రామాల్లో స్పెయిన్ బృందం పర్యటన



బంద్రేపల్లిలో ఓ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న స్పెయిన్ దేశస్తులు

రొళ్ల: మండలంలోని బంద్రేపల్లిలో ఒంటరి మహిళ చైత్ర ఇంటి గృహ ప్రవేశ వేడుకలకు శనివారం స్పెయిన్ బృందం సభ్యులు ఇరాటీ, ఆల్మ తదితరులు హాజరయ్యారు. చైత్రకు ఆర్డీటీ సహకారంతో మంజూరు చేసిన ఇంటిని స్పెయిన్ దేశస్తులు ప్రారంభించారు.అనంతరం స్పెయిన్ బృందం సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలోఆర్డీ మల్లికార్జున, రీజినల్ ఇంజినీర్ రంగనాయకులు, ఏటీఎల్ ఓబులేసు, సీఓలు హనుమంతరాయుడు, చలపతి, మహిళలు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



డీఎస్పీ మహేష్‌ను సన్మానిస్తున్న కళాశాల బృందం

హిందూపురం టౌన్: ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని హిందూపురం డీఎస్పీ మహేష్, ప్రిన్సిపాల్ ప్రగతి సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. జాతీయ పత్రికా దినోత్సవం నిర్వహించి, సమాజంలో పత్రికల పాత్ర, వాక్ స్వాతంత్ర్య ప్రాధాన్యత తెలియజేశారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం బీఎస్సీలో మెరిట్ సాధించిన విద్యార్థినులకు ఉర్దూ భాషా సమితి అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్, బీకాంలో మెరిట్ వచ్చిన విద్యార్థినులకు జీఎస్టీ అధికారి గిరిధర్, బీఏలో మెరిట్ వచ్చిన విద్యార్థినులకు కళాశాల చరిత్ర అధ్యాపకులు, అకడమిక్ కో–ఆర్డినేటర్ శ్రీధర్‌లు గోల్డ్ మెడల్స్ బహూకరించారు.

పరిశ్రమలను సందర్శించిన విద్యార్థులు



ఇండస్ట్రియల్ విజిట్‌కు వచ్చిన విద్యార్థులు

లేపాక్షి: పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు శనివారం హిందూపురం రూరల్ మండలం తూముకుంటలో ఉన్న అప్పరల్స్ ఫ్యాక్టరీ, మైత్రామ్ సీఎంసీ పరిశ్రమలను సందర్శించారు. ఈ సందర్భంగా రిటైల్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన విషయాలను కంపెనీ ప్రతినిధులు వివరించారు. మ్యాను ఫ్యాక్చరింగ్ అయ్యే విధానం, ఐరన్, రా మెటిరియల్ ఏ విధంగా తయారవుతుంది? ఫ్యాబ్రిక్ రూపంలో ఉన్న దుస్తులు ఏ విధంగా షర్టుగా తయారవుతాయనే విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, పీఈటీ రామాంజనేయులు, వృత్తి కోర్సు ఉపాధ్యాయులు నాగరత్న, అనిత, అశ్వర్థనారాయణ, మెర్సిరాణి, పఠాన్, బాబాద్దీన్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

పెనుకొండ రూరల్: ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్ణాటక మద్యం, బెల్టు షాపుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో ఎంఆర్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ సీఐ సృజన్ బాబు,ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు నేలవాలిన వరి



సోమందేపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగోడు, చిన్న బాబయ్యపల్లి, వెలిదడకల గ్రామాల్లో వరి దెబ్బతింది. దాదాపు 70 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు బాధిత రైతులు తెలిపారు. చేతికి వచ్చే దశలో పంట నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలను సందర్శించలేదని రైతులు తెలిపారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు జిల్లా న్యాయమూర్తి కంపెల్ల శైలజ

పరిగి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని హిందూపురం కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ తెలిపారు. శనివారం మండలంలోని కొడిగెనహళ్లి ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు శివకుమార్ నేతృత్వంలో పాఠశాలలోని విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా ఏడీజే కంపల్లె శైలజ పాల్గొన్నారు. సాధారణ విద్యార్థుల కంటే అంగవైకల్యంతో పాటు వికలాంగ విద్యార్థులంతా అత్యంత ప్రతిభావంతులన్నారు. కంటి చూపు లేకపోయినా వారిలో తెలివి తేటలు అధికంగా ఉంటాయన్నారు. కంటి చూపు లేకపోయిన విద్యార్థుల సమస్యలను జిల్లా కలెక్టర్, హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి కంటి అద్దాలను అందించడంతో పాటు వారికి శాశ్వత పరిష్కార మార్గానికి కృషి చేస్తామన్నారు. చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు త్వరలోనే ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి, హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సీనియర్ న్యాయవాది సుదర్శన్, ఏఎస్ఐ శ్రీనివాసులు, బాలాజీ, ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుడ్డం రంగనాథస్వామి కల్యాణం



రంగనాథ స్వామి కల్యాణం వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులు

హిందూపురం: గుడ్డం రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి కల్యాణం జరిపించారు. శ్రీదేవి భూదేవి సమేత గుడ్డం రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. రాత్రి ఆలయ ప్రాంగంణంలో కళ్యాణ వేదిక ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులకు మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ నాగేంద్రుడు, అర్చకులు గోవిందశర్మ పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మరథోత్సవం

గుడ్డం రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు అశేష భక్త జనవాహిని నడుమ రథోత్సవం జరగనుంది.

డిపోలో సమస్యలు పరిష్కరించాలి



డీఎంకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు, డిపోలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం డిపో మేనేజర్ రామసుబ్బయ్యకు ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ ఉప కార్యదర్శి నరసింహులు, డిపో అధ్యక్షుడు రఫీక్ వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ మడకశిర డిపోలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పలు మార్లు వినతులు అందజేసినప్పటికీ పరిష్కరించలేదన్నారు. దీంతో ఈ నెల 19, 20 తేదీల్లో డిపో వద్ద ధర్నా చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చిందన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు నూరుల్లా, కేటీ స్వామి, జేపీ నాయుడు, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే సహకార బ్యాంకు లక్ష్యం

రొళ్ల: రైతుల అభివృద్ధే సహకార బ్యాంక్ లక్ష్యమని ఇన్‌చార్జ్ పర్సన్ వెంకటరెడ్డి, మధూడి ఏడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ సూపర్‌వైజర్, సీఈఓ హనుమంతరాయ అన్నారు. శనివారం పట్టణంలోని మడకశిర ప్రధాన రహదారి పక్కన ఉన్న సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో అఖిల భారత 71వ సహకార వారోత్సవాల్లో భాగంగా సహకార పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సహకార బ్యాంక్ ద్వారా రైతుకు వ్యవసాయం పై తక్కువ వడ్డీకే రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రొళ్ల పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనలో ఎస్ఎస్‌కే విఫలం



తొలగిన షీట్లు చూపిస్తున్న నాగభూషణ రెడ్డి

పావగడ: శనీశ్వరస్వామి భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కార్యనిర్వాహక సంఘం పదాధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానిక ఎస్ఎస్‌కే సంఘం సభ్యుడు, ప్రముఖ రైతు సంఘం నాయకుడు డాక్టర్ వి.నాగభూషణరెడ్డి ఆరోపించారు. శనివారం పావగడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పదాధికారుల నిర్లక్ష్య వైఖరిపై ధ్వజమెత్తారు. ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా అతిథి గృహం నుంచి శనీశ్వరాలయం వరకు ఫ్లై ఓవర్ నిర్మించాలని సంఘం పదాధికారులకు పలుమారుల వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేదని ఆరోపించారు. అలాగే భక్తుల స్నానపు గదులు అధ్వానంగా ఉన్నాయన్నారు. వివాహాలకు అద్దెకు ఇచ్చే ఎస్ఎస్‌కే సముదాయ భవనం వంటశాల క్షీణదశకు చేరుకుందని, వంట గది పైకప్పు పెచ్చులూడి పోతున్నాయని, షీట్లు తొలగి పోయి వర్షపు నీరు లోపలికి వచ్చే ప్రమాదమున్నా పదాధికారులు పట్టించు కోకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ఫ్లై ఓవర్ నిర్మాణం, వంటశాల జీర్ణోద్ధరణ, భక్తులకు నిత్య అన్నదానం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, లేని పక్షంలో ఎస్ఎస్‌కే సముదాయ భవనానికి తాళం వేసి ఆందోళన చేపడతానని ఆయన హెచ్చరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్ కృష్ణ

పెనుకొండ రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో నరేష్ కృష్ణ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు అపార్ నమోదు ప్రక్రియకు సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో సహకరించాలన్నారు. గత వైఎస్సార్ సీపీలో గృహ నిర్మాణాలు పొందిన లబ్ధిదారులు, మార్చి నెల లోపు పూర్తి చేసుకోగలిగితే బిల్లులు అందుతాయన్నారు. ఏపీవో జయమ్మ మాట్లాడుతూ నూతనంగా మండల వ్యాప్తంగా రూ.4.15 కోట్లతో 5.68 కిలో మీటర్లు మేర సీసీ రోడ్లు నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు శుభ్రత, మరుగుదొడ్ల శుభ్రత తదితరవాటిపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీలు చంద్రకళ, రామాంజనేయులు, సర్పంచులు నాగమూర్తి, నాగరాజు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



పూజలకు హాజరైన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండలంలోని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో కార్తీక శనివారం పూజలు నిర్వహించారు. జిల్లెడుగుంట నుంచి ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులను భక్తులు రథంలో ఉంచి ఊరేగింపుగా భక్తరపల్లి ఆలయం వద్దకు తీసుకొచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. లక్ష్మీనిడి మామిడమ్మ, చెందకచెర్లు ఆంజనేయస్వామి , వీరకేతమ్మ , నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు.

గుడిబండ: మండలంలోని దాసరపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం శనివారం సాయంత్రం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరమ్మ, నాయకులు శివన్న, క్రిష్ణమూర్తి, చిత్తయ్య, హనుమంతరాయప్ప పాల్గొన్నారు. పీసీ గిరి గ్రామంలో లింగాచార్య ఆశ్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జానపద సంగీత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



వెంకటేశులు

రొద్దం: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద పెనుకొండ – పావగడ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం బోల్తా పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. శనివారం సాయంత్రం చిన్నమంతూరుకు చెందిన వెంకటేశులు రొద్దం నుంచి పావగడ వైపు వెళ్తున్నాడు. ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడి, గాయాలపాలయ్యాడు. అతన్ని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

గొల్లపల్లి సమీపంలో..

గోరంట్ల: మండలంలోని గొల్లపల్లి సమీపంలో నాలుగు రోడ్ల కూడలిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాగానిపల్లికి చెందిన సాయి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు ఎస్ఐ బాబు తెలిపారు. సాయి ద్విచక్రవాహనంపై సొంత పనిమీద గోరంట్లకు వెళ్తుండగా, మార్గంమధ్యలో బూదిలి వైపు నుంచి కొండాపురం వైపు వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనింది. ఘటనలో సాయి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన అతన్ని 108 వాహనంలో గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాబు తెలిపారు.

తిరుమలకు పాదయాత్ర

హిందూపురం: స్థానిక బాలాజీనగర్ వేంకటేశ్వర ఆలయం ఆధ్వర్యంలో శనివారం తిరుమల తిరుపతికి 550 మంది పాదయాత్రగా తరలివెళ్లారు. కార్యక్రమంలో పాదయాత్ర బృందం కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, కిష్టప్ప ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, రవి బృంద సభ్యులు పురుషోత్తంరెడ్డి, బాలాజీ, వెంకటేష్, సురేష్ రెడ్డి, బాలాజీ, శీన, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు కాళికాంబ ఆలయంలో లక్ష దీపోత్సవం

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో ఉన్న కాళికాంబ కామటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం కార్తీక మాసం పురస్కరించుకుని లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. వేడుకలకు వారణాసి (కాశి) నుంచి డాక్టర్ ఆగర్బనాథ్ అఘోర్ భైరవి హాజరవుతారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో లక్ష దీపోత్సవం కార్యక్రమానికి తరలిరావాలని ప్రధాన అర్చకుడు ప్రకాష్‌చార్, కమిటీ సభ్యులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రొద్దం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా రొద్దం, గౌరాజుపల్లి, ఎం.కొత్తపల్లి, నారనాగేపల్లి, పెద్దగువ్వలపల్లి, దొడగట్ట, రెడ్డిపల్లి, చిన్నమంతూరు తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

హిందూపురం: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్యానల్ న్యాయవాదులు కళావతి, నవేరా రెహ్మాన్, సంతోషి కుమారి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆటోనగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల విద్యాలయంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఇందిరా అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టాలపై తెలుసుకుని గ్రామీణ ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. బాల్యవివాహాలు నేరమని ఎవరైనా గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు చేస్తుంటే స్త్రీ, శిశు సంక్షేమ అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మ, లెజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

బండ ధ్వంసంపై ఫిర్యాదు

అమరాపురం: మండలంలోని కె.శివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కూర్చొవడానికి వేసిన నల్ల బండను ధ్వంసం చేశారని ఉపాధ్యాయులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి వెళ్లి బండను పగులగొట్టారు.

బాలికలు ఉన్నతంగా చదువుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెనుకొండ: బాలికలు ఉన్నతంగా చదవాలని, పోటీతత్వాన్ని అధిగమించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో బాలల హక్కుల వారోత్సవాలు, దత్తత మాసం పురస్కరించుకుని సీడీపీఓ శాంతలక్ష్మి ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ విభాగం తరపున, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ బాలికలను వేధింపుల నుంచి రక్షించడానికి తగిన చర్యలు చేపడుతామన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నాగలక్ష్మి, తిరుమల ఆనంద్, కొండప్ప, సమతా స్వచ్ఛంద సంస్థకు చెందిన మహేష్ పాల్గొన్నారు.

ఏబీబీఎస్ఎస్ అధ్యక్షుడిగా అంజి నాయక్



అంజి నాయక్

సోమందేపల్లి: అఖిల భారత బంజార సేవ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగనాయని చెరువు సర్పంచ్ అంజి నాయక్ ఎంపికయ్యాడు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి పదవిని కట్టబెట్టిన సంఘం జాతీయ అధ్యక్షుడు బాబురావుచౌహాన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



డీడీ అందిస్తున్న ధర్మస్థల క్షేత్ర సంఘం అధికారి మహేశ్

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళి ఆర్‌డీ రొప్ప గ్రామానికి చెందిన చిక్క పాలవాయప్ప స్వామి, ఎల్లమ్మదేవి దేవాలయం అభివృద్ధి ట్రస్ట్‌కు స్థానిక ధర్మ స్థల గ్రామాభివృద్ధి యోజనాధికారి మహేశ్ సంస్థ తరపున రూ.2 లక్షల విరాళాన్ని డీడీ రూపంలో అందించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, పదాధికారులు, ధర్మ స్థల సంస్థ వైఎన్ హొసకోట అధికారి మహ్మద్, సేవా సమితి ప్రతినిధి రాధ పాల్గొన్నారు.